# ఆ ఒక్కటే చెప్పకు

జి.వి.రమణ



చారిగారు తన విరిగిన కుర్చీకాలు బాగు చేయించమని మేనేజరు గారికి చెప్పడం అది ఇరవై నాలుగోసారి.

"ఈ రోజు 'కార్పెంటర్'కి ఫోన్ చేసి పిలిపిస్తాను. ఎలాగో సర్దుకోండి!" కర్ర విరక్కుండా, పాము చావకుండా వుండే పద్ధతిలో ఇరవై నాలుగోసారి మేనేజర్‌గారు అతి మర్యాదపూర్వకమైన గొంతుతో ఎప్పటిలాగే మళ్ళీ చెప్పారు.

చిరాకేస్తే మేనేజరు కుర్చీనే ఎత్తుకొచ్చి తన టేబుల్ దగ్గర వేసుకోగల ఘటికులే చారిగారు. మరెందుకో అలాంటి ప్రయత్నమేదీ ఆయనింత వరకూ చెయ్యలేదు.

బ్యూరోక్రటిక్ వ్యవస్థలో తగిన సిబ్బందిలేని ఆఫీసులూ, వున్న సిబ్బందికి తగిన ఫర్నిచర్ లేక విరిగిన కుర్చీలూ, పుచ్చిన టేబుళ్ళూ వుండడం మామూలే. అయితే అలాంటి కుర్చీల్లో చారిగారిలాంటి వాళ్ళు కూర్చోవడమే ఇలాంటి కథలకు ఆలంబన!

"ఏం మేష్టారూ ఎంతవరకూ వచ్చింది మీ కుర్చీ రిపేరు" మేనేజర్ రూంలోంచి చారిగారు రాగానే అడిగాడు పక్కసీటు పరమేశం.

"షరా మామూలే"

"నాకు తెలియక అడుగుతాను. మీరీ బ్రాంచిలో సీనియర్ మోస్ట్ కదా, ఈ కుర్చీ మరెవరికో వేయించి, మంచి కుర్చీ మీరు వేయించుకోవచ్చు కదా!"

"అది తప్పు నాయనా పరమేశం. ఇక్కడ పనిచేసే మనందరం ఒక్కటే. సీనియరైనా, జూనియరైనా గుమాస్తా గుమాస్తానే! మనలో మనం ఇలాంటివి చేసుకోవడం తప్పు. దేన్ని ఏ పద్ధతిలో సాధించాలో ఆ పద్ధతిలోనే దాన్ని సాధించాలి."

ఏ విషయాన్నైనా ఇలా సమంజసంగా వాదిస్తారు గనకనే ఎవరూ ఆయన్ని డైరెక్టుగా తప్పు పట్టలేరు. అంతెందుకు మేనేజర్‌గారే అనేకసార్లు తను సాధించలేని దేమైనా వుంటే చారిగారి సాయం తీసుకోవడం కద్దు. దీనికి ఉదాహరణగా చెప్పడానికి ఓ సంఘటన ఆ రోజే జరిగింది-

స్టేషనరీ రూము చాలాకాలంగా సర్దకపోవడం చేత చాలా చిందరవందరగా వుంది. అంచేత దాన్ని సర్దమని హెడ్ ప్యూన్ సోమన్నని పిలిచి చెప్పారు మేనేజర్.

"నా ఒక్కడివల్ల ఆ పని కాదండీ, ఎంచేతంటే అక్కడి షెల్ఫులు, అరలూ చాలా ఎత్తుగా వున్నాయి. మరో ప్యూన్ని నాకు తోడుగా ఇస్తే సర్దుతాను" అన్నాడు సోమన్న.

మేనేజరు పక్కనే వున్న రాముల్ని పిలిచి ఆ సంగతే చెప్పేరు. రాములుకీ సోమన్నకీ పడదు. సాయం చెయ్యమంటున్నది సోమన్నకి గనుక, "నాకు వీలు కాదు సార్, నేను రెగ్యులర్‌గా చేసే పనే చాలా వుంది" అన్నాడు రాములు.

మేనేజర్‌గారికి కోపం వచ్చింది. అయితే ఎప్పుడూ ఇలాంటి విషయాల్లో తొందరపడి మెమోలూ, ఛార్జి షీట్ల లాంటి వాటి జోలికి పోరు. అది యూనియన్ల దాకా వెళ్ళి పెద్ద పెద్ద గొడవలౌతాయేమోనని ఆయన భయం.

నయానా భయానా చాలాసేపు చెప్పి చూసేరు రాములుకి. లాభం లేకపోయింది. వేరే ప్యూన్‌లకి చెబ్దామంటే, అందరూ తలా ఓ పనిమీద బిజీగా వున్నారు. చివరికి చారిగారే దిక్కయి, ఆయనను చెప్పి చూడమని కోరారు.

చారిగారందుకున్నారు. "చూడు నాయనా రాములూ, మేనేజర్ లాంటి వారు అడిగినప్పుడు ఎదురు చెప్పడం తప్పు. అసలు ఎవరు ఏది అడిగినా ఎదురు చెప్పడం తప్పే. నీకు వంద కష్టాలుండొచ్చు- అది వేరే సంగతి. సోమన్నకూ నీకూ పడకపోయినా, ఇది ఆఫీసు కనుక కలిసి పని చెయ్యవలసిందే. నీ ఇష్టం వచ్చినట్లు సమాధానం చెప్పకూడదు..."

చారిగారి వాక్ప్రవాహానికి మేనేజర్ ముగ్ధులయి వింటున్నారు. 'ఎంతయినా ఎదుటివారిని 'కన్విన్స్' చెయ్యడంలో గొప్పవాడు చారి' అనుకున్నారు.

చారిగారు కొనసాగిస్తూ వున్నారు "...అంచాత ఎవరు ఏది అడిగినా చేస్తాననే చెప్పాలి..." ఒక్క క్షణం ఆగి అన్నారు "చెయ్యను"- ఆయన ఈ మాటలనగానే బ్రాంచిలో అందరూ ఓసారి ఘొల్లున నవ్వి ఆయనవైపు దృష్టి సారించారు, ఆయన మేనేజర్‌కేదో 'జోల్ట్' ఇవ్వబోతున్నట్టు గ్రహించి.

చారిగారి వాక్ప్రవాహం తిరిగి వేగం పుంజుకుంది. "బ్యూరోక్రసీలోని ఈ గొప్ప సిద్ధాంతాన్ని నాకు మన మేనేజర్‌గారే నేర్పేరు; చెయ్యకపోయినా వంద విషయాలు చెప్పకానీ 'చెయ్యను' అని ఆ ఒక్కటీ మాత్రం చెప్పకు..." మేనేజర్‌గారికేదో అనుమానం వచ్చి అక్కడినుంచీ తన ఛాంబర్‌వైపు వెళ్ళడానికి ఆయత్తమవసాగారు. అయినా చారిగారు ఆపలేదు. చివరి మాట అనేశారు "లేకపోతే విరిగిన కుర్చీ బాగు చేయించమని ఇరవై నాలుగుసార్లు అడిగినా ఒక్కసారన్నా 'చేయించను' అని చెప్పలేదు."

అడుగుల వేగం హెచ్చించి వడిగా వెళ్ళబోయి దారిలో వున్న పుచ్చిన చిన్న బల్లనొకదాన్ని గుద్దుకుని కిందపడ్డారు మేనేజరు. ఆయనకు సాయంపట్టడానికి చారిగారు కుర్చీలోంచి లేచి, అది బెసగడంతో తనూ కిందపడ్డారు. అయినా తమాయించుకుని లేచివెళ్ళి మేనేజర్‌కి సాయంపట్టి ఛాంబర్‌లో దింపివచ్చారు.

తర్వాత చారిగారి కుర్చీ వెంటనే బాగుపడింది. అయితే స్టేషనరీ రూము సర్దబడిందో లేదోనన్న ఒక్కటీ మీకు చెప్పకపోయినా ఫరవాలేదని మాత్రం భావిస్తున్నాను.